# "ఒరే ఇడియట్" అనుకున్న అరిటాకు కథ

## యండమూరి వీరేంద్రనాథ్

**"అరిటాకు, ముల్లు సామెతలో ఇడియట్ ఎవరు? అరిటాకు తనే ఇడియట్‌లా ప్రవర్తించి ముల్లును పట్టుకుని 'ఒరే ఇడియట్' అంటే .. నష్టం ఎవరికి?**

**ఆడపిల్ల అందంగా వుండాలి, చురుకుగానూ వుండాలి. చేయిచేయి కలిపే చొరవ వుండాలి అంత చనువు తీసుకున్న ఆడపిల్ల పెళ్ళి చేసుకోడానికి పనికిరాదా అంటే? ఆ పిల్లలో ఆ తెగింపు కలిగించిన నేరం ఎవరి దవుతుంది?"**

"మీరెక్కడి వరకూ వెళ్ళుతున్నారు?"

కిటికీలోంచి బైటకి కదులుతున్న చెట్లనూ, గుట్టలనూ చూస్తున్న శైలజ ఉలిక్కిపడి తలతిప్పి చూసింది. రాఘవరావు ఆమెనే చూస్తున్నాడు.

రైలు కూతపెట్టుకుంటూ ముందుకు సాగి పోతూంది. కంపార్ట్‌మెంట్‌లో నలుగురైదుగురు కన్నా ఎక్కువ మంది లేరు. ఇద్దరు నిద్రకి జోగు తున్నారు. ఇంకొకాయన ప్రొద్దుటి పేపరు ఇంకా దీక్షగా చదువుతున్నాడు. రాత్రి తాలూకు చీకట్లు కొద్దికొద్దిగా అలముకుంటున్నాయి.

"సామర్లకోట" అంది శైలజ. ఆమె సన్నగా నాజూగ్గా ఉంది. పలుచటి చెక్కిళ్ళు, గడ్డం మీద ఎడమవైపున చిన్న పుట్టుమచ్చ, కొద్ది నిరల్మంగా ఉన్న తీక్షణమైన కళ్ళూ— పదిమందిలో అందె కత్తెలా అనిపించదు కానీ—ఏడిగా కొద్దిపాటి స్నేహంతో ఆమె చాలా కాలం జ్ఞాపకం ఉండి పోతుంది. ఆమె ముక్తసరి తనం చూసి అతను మళ్ళీ ఇంకో ప్రశ్న వెయ్యటానికి సాహసించలేదు.

చాలా సేపు మవునంగా ఉండి "హైదరాబాద్‌లో పని చేస్తున్నారా?" అని అడిగాడు దాదాపు గంట అయ్యాక. ఎక్స్‌ప్రెస్ కాబట్టి ఎక్కడా ఆగకుండా పోతోంది రైలు.

"అవును—సెక్రటేరియట్‌లో."

"ఏం చదివారు?"

"బి. ఎ."

మళ్ళీ చాలా సేపు మవునం. ఆమె ప్రక్కన కూర్చుని జోగుతున్న ముసలామె ఇక అలా కూర్చో వటం సాధ్యంకాదన్నట్టూ—కొంచెం కాళ్ళు సాగించి, సర్దుకుని, నడుం వాల్చింది.

బాగా చీకటి పడింది. టి.సీ. వచ్చి—సీటు నెంబర్లు చెక్‌చేసి వెళ్ళిపోయాడు. శైలజ బాగ్ లోనుంచి ఆర్థర్ హెయిలీ పుస్తకం తీసి చదవటం ప్రారంభించింది.

రైలు కాజీపేటలో ఆగింది

అతనులేస్తూ— "మీరేమైనా తీసుకుంటారా?" అని అడిగాడు. ఆమె కొద్ది మొహమాటంతో "అబ్బే వద్దండీ—" అంది.

"ఏమీ తీసుకోకుండా ఎలా ఉంటారు?"

"అరటి పళ్ళున్నాయి."

రాఘవరావు నవ్వి "అంత మొహమాటం అయితే ఎలా—" అంటూ బయటికి నడిచాడు.

ఆరోజెందుకో అంత రష్ లేదు. ప్లాట్ ఫాం పల్చగా ఉంది. ఆమె చూస్తూ ఉండగానే అతను చేతిలో ఏదో పొట్లంతో వస్తూ కనిపించాడు. మరీ అంత పొడుగూ పొట్టీ కాదు. తెల్లపాంటూ చొక్కా కొంచెం విశాలమైన మొహం. క్రాపు నుదుటి మీదకి పడే య్యాలనే తాపత్రయం.

కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చి "తీసుకోండి"—అన్నాడు.

ఆమె అదే మొహమాటంతో "థాంక్స్"అంది. అతడు తన బాగ్‌లోంచి సీసా బైటికి తీసి, పంపులో నీళ్ళు పట్టుకొచ్చేసరికి ఆమె తినటం పూర్తి చేసి ఆకులు బైటకు వేస్తోంది. అతడు అందించిన నీళ్ళు తీసుకుని కొద్దిగా తాగి, సీసా తిరిగి ఇచ్చేసింది.

ట్రైన్ కూత పెట్టింది, నెమ్మదిగా కదిలింది.

ఈ చర్యతో ఆమెకి స్త్రీ సహజమైన జంకు పోయింది. "మీరెందాకా వెళ్ళాలి" అని అడిగింది.

అతడు చెప్పాడు. ఆమె కిటికీలోంచి బైటకు కొద్దిసేపు చూసి, తిరిగి పుస్తకం తెరవబోతూ ఉంటే, "మీరు దిగిన తర్వాత ఇంకా నేను ఎంత సేపు ట్రైన్‌లో ప్రయాణం చెయ్యాలి?" అని అడిగాడు.

ఆమె చెప్పింది.

"లాంగ్‌లీవ్ పెట్టి వెళ్ళుతున్నారా?"

"లేదండీ నాల్గు రోజులు పెట్టాను" అందామె.

"మీరెక్కడ పనిచేస్తున్నారు?"

"ఏ.జి. ఆఫీసులో" అన్నా డతను.

మళ్ళీ ఆమె పుస్తకం చదవసాగింది. అతను సీట్లో ఏమీ తోచక ఇబ్బందిగా అటూ ఇటూ కదలటం తెలుస్తూనే ఉంది. పుస్తకం మూసి "—మీరు ఇటు వైపు రావటం మొదటిసారా?" అడిగింది.

ఆమె పుస్తకాన్ని మూయడం అతడికి ఆనందం కలిగిందని అతని మొహమే చెబుతోంది— "అవునండీ"అన్నాడు. "మాది తెలంగాణా."

"ఏజీ ఆఫీసంటే కాంపులెక్కువ ఉంటాయా?"

అతను ఉంటాయన్నట్లు తలూపాడు.

తరువాత ఏం మాట్లాడాలో అతనికి తెలియ లేదు, కానీ అతనే అన్నాడు—"మీరు బాగా పుస్తకాలు చదువుతూ ఉంటారా—."

ఆమె చిరునవ్వుతో "ఏమీ తోచదండీ అందు కని . . ." అంటూ అర్థోక్తిలో ఆపు చేసింది.

అతను సమర్థిస్తున్నట్టూ "అన్నటి కన్నా ఇది మంచి అలవాటండీ" అన్నాడు.

"మీరూ చదువుతారా?"

"ఆ అంత కాకపోయినా—కొద్దిగా"

ఆమె కొద్ది ఉత్సాహంతో "మీ అభిమాన రచయిత లెవరు?"

చప్పున ఏదో ఒకటి రెండు పేర్లు చెప్పటానికి రాఘవరావు తటపటాయించాడు. అయినా ఏదో ఒకటి చెప్పాలి కనుక—వార పత్రికల్లో కనబడే నలుగురయిదుగురు రచయితల పేర్లు చెప్పాడు.

ఆమె అతడి జవాబుతో కొంచెం నిరాశ చెంది నట్లు కనిపించినా, దాన్ని కప్పి పుచ్చుకుంటూ "బుచ్చి బాబూ, చలం— . . ."అని ఆగి 'పోనీ అమృతం కురిసిన రాత్రి . . .గోపీచంద్"అంది.

రాఘవరావు అస్పష్టంగా తలూపి"మీరు సినిమాలు చూస్తారా" అన్నాడు.

'అప్పుడప్పుడు" అందామె.

రాఘవరావు వేలు విడిచిన మావయ్య ఒకడు మద్రాసులో ఈ ఫీల్డులో స్థిరపడ్డాడు. అతడేం చేస్తూ ఉంటాడో ఎవరికీ తెలియదుకానీ అక్కడి విశేషాలన్నీ విశేషణాలతో కలిపి వర్ణిస్తూ ఉంటాడు.

ప్రస్తుతం ఆ పని రాఘవరావు తీసుకున్నాడు. విషయం ఈ టాపిక్ మీదికి వచ్చే సరికి ఇక అతడికి తడుముకునే అవసరం లేకపోయింది. ఆమెకూడా ముందుకువంగి, అతడు చెప్పేది ఉత్సాహంగా వినసాగింది. అతడు చెప్పటం పూర్తి చేసే సరికి ఆమె అభినందిస్తున్నట్లు "మీకు ఈ విషయాలు చాలా తెలుసే" అంది.

"మీలాంటి అందమైన అమ్మాయి— ఎదురుగా ఉంటే ఏమీ తెలియకపోయినా చాలా మాట్లాడ వచ్చు . . ."అన్నాడు.

ఈ మాటల్లో ఏదైనా లేకితనం ఉందా అని ఆమె అతడివైపు చూసి, అటువంటిదేమీ కనబడ పోవటంతో "థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్"అంది దాన్ని తేలికగా తీసుకుంటూ.

"ఎప్పుడూ నేను మాట్లాడటమే. మీరేమీ మాటాడరేం? ' అన్నాడు.

ఆమె చిరునవ్వుతో "ఏం మాట్లాడను" అంది.

'మాట్లాడాలనుకుంటే ఏమైనా మాట్లాడ వచ్చు. రోమాన్స్ నుంచి రోదసీయానం వరకూ."

అతడి ప్రాసకి ఆమెకి నవ్వొచ్చింది. నిజానికి ఆమె స్నేహితులతో చాలా హుషారుగా, చలాకీగా ఉంటుంది. అయితే మగవాళ్ళతో మాత్రమే స్త్రీ సహజమైన రిజర్వ్‌డ్‌నెస్‌తో మసలు కొంటుంది. అయితే ఇతడి కలుపుగోలుతనం ఆమె బిడియాన్ని పోగొడ్తోంది. ఆమె వొరేషియస్ రీడర్. ఆకారణంగా ఆమె మాట్లాడాలనుకుంటే తడుముకునే అవసరమేమీ లేదు.

రాజకీయాల్లో మొదలై, స్పోర్ట్స్ వైపుకి వెళ్ళి మద్యనిషేధం మీదుగా—వార పత్రికల్లో వచ్చే కథలూ— ఫాషన్లూ— కాలేజీ చదువుల మీదకి వెళ్ళింది సబ్జెక్టు.

గంట గడిచే సరికి ఆమెకి అతడెంతో దగ్గర స్నేహితుడిగా కనిపించాడు. ట్రైన్ ఏదో స్టేషన్‌లో ఆగి, కొత్తపెట్టె ముందుకు సాగింది. చల్లటిగాలి నెమ్మదిగా వస్తోంది. రాఘవరావు సిగరెట్ వెలిగించుకున్నాడు. రైలు కుదుపుకి నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది శైలజ. మళ్ళీ చిన్న జర్కుతో రైలు ఆగటంతో ఆమె కళ్ళు విప్పేసరికి లైట్ల వెలుతుర్లో పట్టపగల్లా విజయవాడ ప్లాట్‌ఫాం కనిపించింది. ఆమె తలతిప్పి చూస్తే, అప్పటి వరకూ తననే చూస్తున్న రాఘవరావు కనుపడ్డాడు.

జుట్టుపాయని చెవి వెనక్కి తోసుకుంటూ నిద్రకళ్ళతోనే నవ్వింది.



"మాట్లాడుతూనే నిద్రపోయారు" అన్నాడు.

ఆమె టైమ్ చూసుకుంది — ఒంటిగంట.

దాదాపు మూడుగంటలు నిద్ర పోవటం వల్ల తేలిగ్గా ఉంది. లేచి వళ్ళు మొహం కడుక్కుని వచ్చింది. కంపార్ట్‌మెంట్‌లో నుంచి ఒకరు దిగి పోయారు.

"టీ తాగుతారా?"

ఆమె వద్దన్నట్టు తలూపింది.

"మీకు బ్రదర్సు, సిస్టర్స్ ఉన్నారా?" అడిగాడు

"లేరు."

"అదృష్టవంతులు."

"మీకు—"

ఆమె సర్దుకుని కూర్చోవటంలో ఏరుకుప్పిళ్ళు అతని కాలిమీద పడ్డాయి.

"ముగ్గురు చెల్లెళ్ళు" అన్నాడు.

"అయితే మీకు చాలా కష్టం కావాలన్న మాట" అందామె.

"లేదు మా ఫాదర్ చాలా ప్రిన్సిపుల్డ్" అన్నాడు. కాజువల్‌గా కాలు ముందుకు జరుపుతూ.

ఆమె కాలు వెనక్కి తీసుకుని "మరి మీరు?" అంది.

"నేను ఆలోచించవలసింది — నా కొడుకుల సంగతి, నాకింకా పెళ్ళి కాలేదు కదా" నిజానికి రెండో వాక్యం ఇక్కడ వాడాల్సిన పనిలేదు.

ఆమె తలతిప్పి బైటికి చూడసాగింది. ఎక్కట్లో ఎక్కడో దూరంగా దీపం వెనక్కి కదుల్తోంది. పై బెర్తు మీది నుంచి ఎవరో "ఏలూరు స్టేషనా" అని అడిగారు.

"ఆ, ఇంకో పావు గంటలో."

పైనున్న వాళ్ళు దిగి, బెడ్డింగులు సర్దుకునే సరికి స్టేషన్ వచ్చింది. ఇద్దరూ దిగిపోయారు. పక్కన కూర్చున్న ముసలతను పైకి వెళ్ళి పడుకున్నాడు.

ట్రైన్ కదిలింది.

"నేను చాలా అదృష్టవంతుణ్ణి" అన్నాడు రాఘవరావు.

ఆమె కొద్ది ఆశ్చర్యంతో "ఎందుకు" అని అడిగింది.

"ఈ ఒంటరి ప్రయాణంలో ఇలా ఒక మంచి స్నేహితురాలు దొరికినందుకు."

"ఆమాట నే నవాలి—"

అతను వప్పుకోనూ అన్నట్టుగా తల అడ్డంగా ఊపేడు.

"పోనీలెండి. ఇక ఆ పరస్పర పొగుడుకోవటాలు వదిలిపెడదాం" అన్నదామె నవ్వుతూ.

"ఒక్క విషయం మాత్రం నిజం" అన్నాడు.

"ఏమిటి?"

"మిమ్మల్ని చేసుకోబోయేవాడు చాలా అదృష్టవంతుడు."

ఆమె సిగ్గుతో—"ప్లీజ్. ఇక ఆ సంగతి వదిలిపెట్టండి—" అంది.

ఆమె దిగాల్సిన ఊరు దగ్గరపడుతున్న కొద్దీ అతడిలో ఆదోలాటి దిగులు ఆవరించసాగింది. కొంచెం సేపట్లో ఆమె ఆగిపోతూ ఉండటం అతని కెలాగో ఉంది. ఈ రైలు ప్రయాణం ఇలానే సాగిపోతే బావుణ్ణు అన్న భావన.

## ఈ ఉదయం

ఈ ఉదయం కదిలించింది
నా హృదయం ఉదయించింది
అమృతంలో తడిసిన క్షణమిది
అందాల హరివిల్లు విరిసిన దిన మిది

నాలో చైతన్యభావం ఉరగలెత్తింది
ఎదలో సౌజన్యగీతం పరుగులెత్తింది
భావాన్ని రసరాగమాలికగా పలుకలేను
గీతాన్ని నవపారిజాతంగా తలచలేను

పగటి పూట సిరివెన్నెల తోట
కనిపించింది
కారుచీకటి తోట కాంతి పూల బాట
వినిపించింది
అనుభూతిని మధురగీతికగా వర్ణించలేను
అనుభవాన్ని చలువరాతిలా అనుభవించలేను

ఉదయకాంతి లక్షణం వ్యాపించుట
హృదయభావ లక్ష్యం దీప్తించుట
అభ్యుదయం ఉగాది ఈ ఉదయం
మానవతావాదం నేటి నా హృదయం

-వక్కా ప్రసాదరావు.

అతనన్నాడు—

"మొదట్లో మిమ్మల్ని పలకరిద్దామా, వద్దా అని చాలా సేపు తటపటాయించాను. రెండు మూడు ప్రశ్నలకి మీ ముక్తసరి జవాబు చూసి నా మీద మీకు సదభిప్రాయం ఏర్పడలేదేమో, నేను మిమ్మల్ని ఇంప్రెస్ చెయ్యలేదేమో అనుకున్నాను."

ఆ మాటలకు ఆమె నొచ్చుకొంటున్నట్టు "సారీ" అంది.

"దీంట్లో క్షమాపణ ప్రసక్తేముంది నలుగురు మగవాళ్ళ మధ్య పనిచేసే వాళ్ళు ఆ మాత్రం రిజర్వ్‌డ్‌గా ఉండకపోతే కష్టం."

ఆమాటలు ఆమెకి నచ్చినట్టు "మీరు చెప్పింది నిజమే" అంది.

కొంచెం సేపు నిశ్శబ్దం.

అంతసేపూ మాట్లాడినవాడికి—గమ్యం దగ్గర పడి విడిపోవాల్సిన టైమ్ వచ్చే సరికి మాటలే దొరకటం లేదు.

"విడిపోవటం బాధాకరం" అన్నాడు.

"అవును ఎక్కడో కొటేషన్ చదివేను. టాగూర్‌దే అనుకుంటా" అందామె ఆలోచిస్తూ.

"మీవి,నావీ—భావాలు చాలా వరకు కలుస్తాయి." అన్నాడతను. కిటికీలోనుంచి బైటకు చూస్తున్న దల్లా తలతిప్పి అతడివైపు చూసింది. మాట్లాడ లేదు.

తూర్పు బాగా ఎర్రబడింది.

షుగర్ ఫ్యాక్టరీ గొట్టం దాటిపోయింది.

రైలు ప్లాట్‌ఫాం మీదికొచ్చి ఆగబోతూ ఉంటే "నాన్నగారొచ్చారు" అంది చిన్న పిల్లలా సంబర పడుతూ.

రైలు ఆగింది.

ఆమె—"వెళ్ళొస్తానండీ నమస్తే" అంది చేతులు జోడించి.

అతడు విషాదంగా "మళ్ళీ రావటం ఏముంది? వెళ్ళిపోతున్నారు" అన్నాడు.

ఆమె నవ్వి ముందుకు కదిలింది.

"శైలజగారూ" అన్నాడు.

ఆమె ఆగి వెనక్కి తిరిగింది.

కరస్పర్శ కోసం అన్నట్టుగా చెయ్యి సాచాడు. ఆమె క్షణం విస్తుబోయినా అతడిమీదున్న గౌరవంతో, తన తటపటాయింపు కనపడనివ్వకుండా చెయ్యి అందించి, దిగిపోయింది.

* * *

రాఘవరావు కాకినాడ చేరుకునే సరికి ఏడిమిదయింది. స్నానం చేసి పడుకుంటే క్రితం రాత్రి నిద్ర లేకపోవటం వల్ల దాదాపు మూడింటికి మెలకువ వచ్చింది.

హోటల్ రూమ్ నుంచి ఫోన్ చేశాడు.

అతడు టిఫిన్ తిని, రెడీ అయ్యే సరికి ఒకాయన వచ్చారు. బక్క పల్చగా ఉన్నారు. వలభై అయిదేళ్ళుంటాయి. పరస్పర పరిచయాలయ్యాక 'వెళ్దామా" అన్నారు. రాఘవరావు తలూపేడు.

టాక్సీ చిన్న బంగళా ముందు ఆగింది. చుట్టూ ప్రహరీగోడ, గులాబీ చెట్లు.

ఇద్దరు వెళ్ళి ముందు గదిలో కూర్చున్నారు. రాఘవరావుతో రెండు నిముషాలు మాట్లాడి—ఆయన లోపలికి వెళ్ళి వచ్చారు. అయిదు నిముషాల తర్వాత అమ్మాయొచ్చింది.

ఆమె వచ్చే సమయానికి రాఘవరావు గుప్పెటతో మిక్చర్ నోట్లో వేసుకోబోతున్నాడు. ఆమెని చూడగానే అతడికి పొలమారింది. ఆమె శైలజ.

శైలజ కూడా అతడిని చూసి ఆశ్చర్యపోయింది. అంతలోనే, సర్దుకుంది. ఆమె పెదవుల మీద విరిసీ విరియనట్టు నవ్వు నాట్యం చేసింది.

పది నిమిషాలు కూర్చుని రాఘవరావు లేచాడు. ఆయనతో కలిసి బైటకొచ్చి టాక్సీ ఎక్కి హోటల్‌కి వచ్చేశాడు.

ఆరోజే బయలుదేరి తన ఊరు వచ్చేశాడు . . . .

హైదరాబాద్ రాగానే తండ్రికి ఉత్తరం వ్రాసి, ఆఫీసుకి వెళ్తూ వెళ్తూ ఫోన్ చేశాడు. ఆఫీసులో విశ్వం కనపడ్డాడు.

స్నేహితుణ్ణి పలకరిస్తూ "పెళ్ళి చూపులకి వెళ్ళావటకదోయ్—ఏమైందిఏ?" అని అడిగేడు రాఘవరావుని.

"నచ్చలేదని వ్రాసేశానోయ్"

"ఏం? బాగా లేదా?"

"అమ్మాయి బాగా ఉంది కానీ చాలా ఫాస్టోయ్ మనకి సరిపోదు" అన్నాడు రాఘవరావు. *